క్లుప్తంగా

ముందుకు కదలని మురుగు



జాతీయ రహదారి పక్కన నిలిచిపోయిన మురుగునీరు

పెనుకొండ రూరల్: మురుగుకాలువల్లో మురుగు కదలకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో బాటసారులు ముక్కు మూసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాలు.. పెనుకొండ 44వ జాతీయ రహదారి పక్కన వెంకటగిరిపాళ్యం వెళ్లే రహదారి, కోటక్ కంపెనీ పక్కన గల రెయిన్ డ్రైనేజీ బ్రిడ్జి మూసుకుపోవడంతో సమీపంలోని కంపెనీల నుంచి వెలువడే మురుగునీరు పేరుకుపోతుంది. అటుగా వెళ్లే బాటసారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దోమలపై అప్రమత్తత అవసరం



వసతిగృహంలో మలాథియాన్‌ను పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారులు

గోరంట్ల: విద్యార్థులు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర బీసీ బాలర వసతిగృహం, గిరిజన బాలికల వసతి గృహం, ఖాజాపురం సమీపంలోని కస్తూర్బా వసతిగృహాల్లో దోమల నివారణ కోసం మలాథియాన్‌ను పిచికారీ చేయించారు. దోమ కాటుతో డెంగీ, మలేరియా, మెదడువ్యాపు వ్యాధులు సోకుతాయని వైద్యాధికారులు పేర్కొన్నారు. మలాథియాన్ పిచికారీ చేయడం వల్ల దోమలను నివారణ చేయవచ్చునని మాలేరి సబ్ యూనిట్ అధికారి శివన్న పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగాధర్, ఎంపీహెచ్ఈఓ రమణ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వాహనం బోల్తా



బోల్తా పడిన ఐచర్ వాహనం

చిలమత్తూరు: మండలంలోని 44 వ నంబరు జాతీయ రహదారిపై పెద్దనపల్లి క్రాస్ వద్ద శనివారం ఐచర్ వాహనం బోల్తా పడింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపునకు రాయి పౌడర్ తీసుకొని వెళ్తుండగా పెద్దనపల్లి క్రాస్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



బిసలమానేపల్లిలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండల కేంద్రంతో పాటు బిసలమానేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సీడీపీఓ రెడ్డిరమణమ్మ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల దాటిన చిన్నారులకు డిగ్రీ తరహాలో పట్టా అందించి గౌరవించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరమ్మ, సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, జయమ్మ, పిల్లల తల్లులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు



పుస్తక సామాగ్రిని అందించిన ఎంఈఓ శేషాచలం, హెచ్ఎం మహంతేష్

పరిగి: విద్యతోనే చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని ఎంఈఓ శేషాచలం అన్నారు. నేతులపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం హిందూపురం ప్రాంతంలోని ప్రముఖ జువేలరీ షాప్ యజమాని ఈశ్వర్ తన కుమార్తె శ్రీఆధ్యా జ్ఞాపకార్థం విద్యాసామగ్రిని అందజేశారు. తామెంత సంపాదించినా పొరుగువారికి సాయపడటంలో ఉన్నంత సంతోషం మరెక్కడా దొరకదని ఎంఈఓ అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహంతేష్, ఉపాధ్యాయులు హేమలత, ఆనందరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సతీష్, సీఆర్పీఎఫ్ జవాన్ గోపి తదితరులు పాల్గొన్నారు.

అంతర పంట.. లాభాలేనంట!

- అదనపు ఆదాయానికి మార్గం
- ప్రకృతి వ్యవసాయంతో మరింత ఆదాయం



ఆమిదాలగొందిలో రైతు రామాంజనేయరెడ్డి మునగలో సాగు చేసిన అంతర పంటలు

మడకశిరరూరల్: రైతులు అంతర పంటలతో లాభాల బాటలో పయనిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందుతున్నారు. వివరాల్లోకెళితే.. గత ప్రభుత్వం అంతర పంటలతోపాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించింది. ఈ నేపథ్యంలో పెద్దసంఖ్యలో రైతులు ఈ పద్ధతులపై మక్కువ చూపారు. ఈ ఏడాది దాదాపు 12 వేల మంది రైతులు 26,300 ఎకరాల్లో అంతర పంటలను సాగు చేశారు. డ్రిప్ ద్వారా వక్క, మునగ, అరటి,మామిడి తదితర పంటల్లో అలసంద, వంకాయ, అముదం, కొర్ర, జొన్న, బెండ, గోరుచిక్కుడు, ముల్లంగి, మిరప తదితర 10 రకాలకు పైగా అంతర పంటలను సాగు చేసి మంచి దిగుబడితో లాభాల బాటలో పయనిస్తున్నారు. అంతర పంటలో సాగు చేసిన కూరగాయల ద్వారా వారానికి ఒక్కసారి మార్కెట్‌లో విక్రయించి ఆదనపు అదాయం పొందుతున్నారు. వక్క,మునగ, అరటి, మామిడి పంటల్లో పంట మార్పిడి చేసి ఒక సారి కూరగాయలు, మరోసారి పూల మొక్కలు, చిరుధాన్యాల పంటలను సాగు చేసి ఆదాయాన్ని గడిస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి అంతర పంటల సాగుతో పెట్టుబడికి పెట్టిన ఖర్చులు వస్తాయని రైతులు చెబుతున్నారు. 15 రోజుల క్రితం రైతు రామాంజినేయరెడ్డి మునగలో సాగు చేసిన అంతర పంటలను రైతు సాధికార సంస్థ డీడీఏ శ్రీనివాసులు పరిశీలించి రైతులతో అభిప్రాయాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయం..

మడకశిర డివిజన్ పరిధిలోని మడకశిర, అమరాపురం ,అగళి, రొళ్ల, గుడిబండ మండలాల్లో 134 గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం పద్ధతుల ద్వారా వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులపై మహిళా రైతులు అవగాహన పెంచుకుని పంటల సాగులో రాణిస్తున్నారు.

మునగ తోటలో 10 రకాల అంతర పంటలు



ప్రకృతి వ్యవసాయం ద్వారా రెండెకరాల్లో డ్రిప్ ద్వారా మునగ తోట సాగు చేశాను. మునగ విత్తనాలు మొలకెత్తిన తర్వాత అసలంద, బెండ, కొర్రలు, కంది,గోరు చిక్కుడు, అముదం, మిరప, టమోటా తదితర 10 రకాల అంతర పంటల విత్తనాలను సాగు చేసి మూడేళ్ల నుంచి అదనపు ఆదాయం పొందుతున్నాం. సేంద్రియ పద్ధతుల ద్వారా అధిక దిగుబడిపాటు నాణ్యమైన పంటలు పండిస్తున్నా.

– రామాంజనేయరెడ్డి, ఆమిదాలగొంది, మడకశిర మండలం

అంతర పంటలతో ఆదాయం



బోరు బావి కింద 1.5 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా డ్రిప్ సౌకర్యంతో వక్క పంట సాగు చేశా.అందులో కంది, అలసంద, అముదం, కొర్ర, కూరగాయలు తదితర 10 రకాల అంతర పంటలను సాగు చేసి ఏడేళ్ల నుంచి అదనపు అదాయం పొందుతున్నాను. మరో 3.5 ఎకరాల్లో డ్రై సోయింగ్ పంటల్లో కూడా అంతర పంటలు సాగు చేశాను.

– శ్రీనివాసులు, రైతు, శంకరగల్లు, గుడిబండ మండలం

వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూల్చివేత దారుణం



వైఎస్సార్‌సీపీ నేత ఈరలక్కప్ప

గుడిబండ: తాడేపల్లిలో నిర్మాణ దశలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని శనివారం వేకువజామున కూల్చివేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ నేత ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని తొలగించొద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చి వాటిని బేఖాతర్ చేశారన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని మంచికి ఉపయోగించాలే తప్ప ఇలా కక్షసాధింపు చర్యలకు కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని ఆయన హితవుపలికారు.

రొళ్ల: తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చి వేడయం బాధాకరమని తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యాలయం కూల్చివేతను ఆపాలని సీఆర్డీఏ ప్రిలిమినరీ ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ శుక్రవారమే వైఎస్సార్‌సీపీ హైకోర్టును ఆశ్రయించిందని గుర్తు చేశారు. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించొద్దని హైకోర్టు ఆదేశించినా పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అందరి పై ఉందని తెలిపారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోండి



ఆర్టీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓ కరుణసాగర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ హిందూపురం డివిజన్ వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో స్కూలు బస్సులు సరైన కండిషన్, ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారన్నారు. అలాంటి విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిమితి మించి విద్యార్థులను స్కూల్ బస్సులో ఎక్కించకుండా చూడాలన్నారు. ప్రతి బస్సుకి డ్రైవర్‌తో పాటు క్లీనర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, జశ్వంత్, హుసేన్, అఫ్రీద్, విక్రమ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవలు మొదలుకుని అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. తర్వాత నవగ్రహారాధన, విష్ణు సహస్ర, అష్టోత్తర నామాలు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వడి బియ్యం, వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో లక్ష్మీదేవి సమేతంగా నరసింహస్వామిని అలంకరించి మహామంగళారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

మెనూ తప్పక పాటించాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని ఎంఈఓ శ్రీధర్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. శనివారం ఎం.రాయాపురం జిల్లా పరిషత్, ఎంఆర్ గొల్లహట్టి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన స్వయంగా విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. భోజనం తయారు చేసే ప్రదేశంలో పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్య సామగ్రి ప్రతి ఒక్కరికీ అందాయా లేదా అని విద్యార్థులతో ఆరా తీశారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని వారికి సూచించారు.

అన్నదాన సత్రం నిర్వహణకు విరాళం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో నిర్మించిన అన్నదాన సత్రం నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు హరివత్స విరాళం అందించారు. శనివారం అన్నదాన సత్రం కమిటీ సభ్యులకు రూ.10 వేలు విరాళం అందజేశారు. దాతను ఆలయకమిటీ సభ్యులు సత్కరించారు.

పొంచి ఉన్న ప్రమాదం



చేతికి అందే ఎత్తులో అమర్చిన విద్యుత్ ఫ్యూజులు

రొళ్ల: దొడ్డేరి ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభానికి చేతికి అందే ఎత్తులో ఫ్యూజులు అమర్చడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం రొళ్ల పట్టణ సమీపాన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మకు అమర్చిన వైర్లు వేలాడుతుండడంతో రొళ్లగొల్లహట్టికి చెందిన పూజారి రామప్పకు చెందిన ఒక మేక, ఒక గొర్రె విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. దొడ్డేరి ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కనే స్తంభానికి ఫీజులు అమర్చడంతో చిన్నపిల్లలు ఆటలు ఆడే టప్పుడు, జీవాలు ఆపక్కకు వెళ్లినప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



కొడికొండలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



పూలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ-1 సాల్మన్‌రాజ్ చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. కొడికొండలో శనివారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పిల్లలు ఉండాల్సింది ప్రభుత్వ బడిలోనే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హర్‌జైనాయక్, శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

అగళి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని పూలపల్లి, హనుమపపల్లి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతోపాటు విద్యార్థులకు పాఠ్య, పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా అందిస్తారన్నారు. బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా పూలపల్లిలో హేమ బాలిక ఇంతవరకు పాఠశాలకు వెళ్లని విషాయన్ని గుర్తించి బాలికను పాఠశాలలో చేర్పించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈఓ వైఖరిపై ఉపాధ్యాయ సంఘాల నిరసన



డీఇఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కొత్తచెరువు: డీఈఓ వైఖరిని నిరసిస్తూ కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయాన్ని శనివారం అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ముట్టడించాయి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల 21న యోగాడే సందర్భంగా కొత్తచెరువు బాలికల ఉన్నత పాఠశాలకు వచ్చిన డీఇఓ మీనాక్షి తనకు సరైన గౌరవం ఇవ్వలేదని నెపంతో యోగా కార్యక్రమం సక్రమంగా నిర్వహించలేదని పాఠశాల పీడీ జానకిని సస్పెండ్ చేశారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. సస్పెండ్ అయిన పీడీ జానకిని నాలుగు రోజుల్లో విధుల్లోకి తీసుకోవాలని, ప్రధానోపాధ్యాయురాలిపై షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నా నిర్వహిస్తామన్నారు.

సాగు ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ



మహిళా రైతుకు కొర్రలను అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: చిరుధాన్యాల సాగుకు ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా వస్తుందని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ జాన్సన్ పేర్కొన్నారు. చిరుధాన్యాల సాగుపై స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో గత రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. కో ఆర్డినేటర్‌తో పాటు వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏడీఏ సత్యనారాయణలు మాట్లాడారు. రైతులు చిరుధాన్యాల సాగు అర ఎకరం నుంచి ఎకరం వరకు విస్తీర్ణం పెంచుకుంటే మంచి ఆదాయం వస్తుందన్నారు. 70 లేదా 80 రోజుల్లోనే పంట చేతికి వస్తుందన్నారు. చీడపీడల సమస్య అంతగా ఉండదని చెప్పారు. చిరుధాన్యాలకు మంచి మార్కెటింగ్ ఉందన్నారు. రైతులు చిరుధాన్యాల సాగుతో ఆదాయంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం పలువురు రైతులు సాగు చేసేందుకు చిరుధాన్యాలను అందజేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసన్నకుమార్ నాయుడు ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని దామాజిపల్లి, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలు అందరికి అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలను జాగ్రత్తగా ఉపయోగించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన

తాడిమర్రి: సీహెచ్ఓ హేమలత శనివారం మద్దులచెర్వు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, జబ్బు పడిన వారికి బీపీ, షుగర్, రక్తం, మూత్ర తదితర పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. సీహెచ్ఓ హేమలత మాట్లాడుతూ ప్రజలు వైద్య చికిత్సల కోసం మండల కేంద్రానికి లేదా విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లకుండా ఇళ్ల వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. తల్లిదండ్రుల ద్వారా జన్యుపరంగా సంక్రమించే సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన పెంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ ముంగిన్‌తాజ్ పాల్గొన్నారు.

అమరాపురంలో కన్నడ సినీ కళాకారులు



అమరాపురం బస్టాండులో ప్రజలతో కళాకారులు

అమరాపురం: స్థానిక బస్టాండులో లయ కోకిల చిత్ర డైరెక్టర్, నటుడు ఎం.ఎస్.రవీంద్ర, విలన్ శివ, సహాయ నటుడు నవీన్‌కుమార్, తదితరులు శనివారం సాయంకాలం బస్టాండులో ప్రత్యక్షమయ్యారు. వీరిని చూడడానికి స్థానికులు ఎగబడ్డారు. స్థానికులు వారిని పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము కన్నడ సినీ పరిశ్రమలో వివిధ పాత్రలతో ప్రజలను సంతోష పరుస్తామన్నారు. కన్నడ సీరియళ్లు, సినిమాలను ఆదరిస్తున్న ప్రజలకు అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక నవీన్‌కుమార్ స్వగృహంలో నిర్వహించిన నామకరణ ఉత్సవంలో పాల్గొన్నారు. ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎస్‌హెచ్ఓ మధు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా ప్రాకారోత్సవం



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలో వెలసిన పేట వేంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించి ప్రాకారోత్సవం జరిపారు. తొలుత ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: సవితా మహర్షి నాయీ బ్రాహ్మణ సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక గుడ్డంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయ కల్యాణమండలంలో బెంగళూరుకు చెందిన సప్తగిరి మెడికల్ కాలేజ్ రీసెర్చ్ సెంటర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 200 మందికి 2డీ ఎకో, ఈసీజీ, కార్డియా ఫిట్ నెస్, బీపీ షుగర్, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 20 మందిని బెంగళూరు సప్తగిరి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు ఇతర పరీక్షలకు రెఫర్ చేశారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపి, ఘనంగా సన్మానించారు. నాయీ బ్రాహ్మణ సేవా సంక్షేమ సంఘం నాయకులు బీఎస్ మూర్తి, నాగేంద్రప్రసాద్, గోపి, రమేష్ బాబు, శ్రీనివాసులు, సీతారామాంజనేయ స్వామి దేవాలయం కమిటీ సభ్యులు డిస్కో నాగరాజు, శ్రీధర్, నారాయణప్ప, యాగక్షత్రియ సాధు చెట్టి సంఘం అధ్యక్షులు జేఈ వెంకటస్వామి, ఆరె కటిక సంఘం నర్సోజీ రావు, బ్రాహ్మణ సంఘం కల్లూరు రాఘవేంద్ర రావు, ఉమర్ ఫారూక్ పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



సూర్యనారాయణ రెడ్డి (ఫైల్)

నల్లచెరువు: గొర్లవాండ్లపల్లికి చెందిన రొద్దం సూర్య నారాయణరెడ్డి అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు కుమార్తె సుమతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈయన కొంతకాలంగా నల్లచెరువు మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీలోని కుమార్తె సుమతి ఇంట్లో నివాస ముంటున్నాడు.ఈ నెల 15వ తేదీ రాత్రి 10గంటల సమయంలో కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. తిరిగి రాకపోవడంతో కుమార్తె, ఆమె కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్ఐ లింగన్న తెలిపారు. సూర్యనారాయణ రెడ్డికి సుమారు 63 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిస్తే 9490922418కి సమాచారం అందజేయాలన్నారు.